
భావి మహాభారతం

భావి మహాభారత స్వరూపం

గాయత్రి మంత్రానికి మూడు చరణాలున్నాయి. అలాగే యుగ నిర్మాణ యోజన కార్యపద్ధతిని మూడు చరణాలుగా విభజించడమైంది. మొదటిది జ్ఞాన యజ్ఞం. రెండవది రచనాత్మక కార్యక్రమాల ప్రేరణ. మూడవది సంఘర్షణ లేదా యుద్ధం. జ్ఞాన యజ్ఞం అంటే ప్రజలకు మంచి మార్గాన్ని నిర్దేశించడం, వికృతమైన ఆలోచనలకు పరిష్కారం చూపడం. తప్పుగా ఆలోచించేవారిని మంచి ఆలోచనల వైపు ప్రేరేపించాలి. మానవుని ఆలోచనలు క్రమపద్ధతిలో లేకపోతే అతను చేసే పని కూడా సరైనదిగా ఉండదు. మానవుడు మంచి పనులను చేయాలంటే అతని ఆలోచనా విధానం సంస్కారవంతంగా ఉండాలి. నేడు సమాజమూ, ధర్మమూ, రాజనీతి మొదలైన వాటిలో ఉన్న వికృతమైన ఆలోచనలను తగురీతిలో పరిష్కరించక పోవడంవల్ల అవి ఇంకా వికృతంగా తయారైనాయి. ఇటువంటి మానసిక పరిస్థితులను సరిచేయడం మన కర్తవ్యం. మురికి పట్టి ఉన్న పాత పద్ధతులనూ,

ఆచారాలనూ, పరంపరలనూ మొదలంటా తీసివేసి వివేకవంతమైన, బుద్ధిమంతమైన ఆలోచనా విధానాలను స్థాపింపచేయడమే జ్ఞానయజ్ఞం.

మన యోజన యొక్క మొదటి పని జ్ఞానము. జ్ఞానముతో కూడిన ఆలోచనలు లేకపోతే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేము. జ్ఞానము మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తుందన్న విశ్వాసం కలిగినపుడు అతను త్యాగశీలిగానూ, కష్టాల్ని సహించే శక్తికల వాడుగనూ, తయారై ప్రగతి పథంలో నడించేందుకు ఉద్యమిస్తాడు.

యుగ నిర్మాణము యొక్క రెండవ అడుగు, ప్రజల్లో రచనాత్మక కార్యక్రమాలు చేయడానికి ప్రేరణ కల్గించడం. తనకూ, తన పిల్లలకూ సేవ చేసుకోవడం కాదు, ఏ సమాజంలోనైతే జన్మించామో, ఏ ధర్మంలో, ఏ సంస్కృతిలో, ఏ ప్రపంచంలో మనం జన్మించామో వాటికి సేవ చేయడం మన కర్తవ్యం. **మన కర్తవ్యాన్ని గురించి తెలుసుకున్నపుడు కొంత సమయాన్ని, కొంత డబ్బునూ**

లోక కల్యాణానికి వినియోగించాలి. అలా చేసినపుడు అది మానవుని పరిపక్వతకు గుర్తింపు తెస్తుంది. ప్రతి మానవునిలో సేవా భావం కలగాలి. సేవాభావమే భగవంతునికి భజన, పూజ. కేవలము పూజ చేస్తూ, ఏ విధమైన సేవ చేయనపుడు ఆ పూజ వ్యర్థము. సేవ చేయాలన్న ప్రవృత్తిని సమాజంలోని ప్రతి ఒక్కరూ అలవర్చుకొని సమాజసేవ తన నిత్యజీవనంలో ఒక భాగంగా చేసుకొని రచనాత్మక కార్యక్రమాలలో నిమగ్న మవ్వాలి. ఆ విధమైన ప్రేరణ కలిగించడమే రచనాత్మక కార్య లక్ష్యం. మానవుడు తనకున్న 24 గంటలలో ఎనిమిది గంటలు నిద్రపోతాడు. 8 గంటలు ధనాన్ని సంపాదించడానికి ఉపయోగిస్తాడు. మిగిలిన 8 గంటలలో **కనీసం 4 గంటలైనా లోక కల్యాణ కార్యక్రమాలకు వినియోగించాలి.**

మొదట ఒక గంట జ్ఞాన ప్రచారం కొరకు పది పైసలు (ఆనాటి కాలంలో యుగ ఋషి సగము కప్పు-టీ, సగము రొట్టె ఖరీదును లెక్కగా తీసుకున్నాడు) నేటి

పరిస్థితిననుసరించి అదే నిష్పత్తిలో అంశదానాన్ని లెక్కించాలి. సేవా కార్యక్రమానికి 4 గంటలు ఉపయోగించాలి. డబ్బును గురించి ఆలోచించి నపుడు సమాజసేవా కార్యక్రమాలకు ఒక రోజు ఆదాయం ఉపయోగించుకొని 29 రోజుల జీతం తన కోసం ఉపయోగించుకోవాలి. వంద రూపాయలు సంపాదించే వాడు సమాజం కోసం 3 రూపాయలు కూడా ఇవ్వలేడా? అంతా మన పొట్టకూ, మన పిల్లల కొరకేనా? అతని సంపాదన మీద సమాజానికి ఏ అర్హతా లేదా? ప్రభుత్వం పన్ను వసూలు చేస్తున్నదంటే దీని కోసమే. ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా సమాజం కోసం కొంత సమయాన్ని, కొంత ధనాన్నీ ఇవ్వడం తప్పని సరిగా అలవాటు చేసుకోవాలి. అప్పుడే సేవా కార్యక్రమాలు జరుగుతాయి.

సేవా కార్యక్రమాలు చేయడానికి సమయం కావాలి. చెమటోడ్చి శ్రమ చేయాలి, డబ్బు కావాలి. ప్రజలు ఇవన్నీ ఇవ్వగలిగినపుడు, రెండవ అడుగు ముందుకు వెళుతుంది. జ్ఞాన యజ్ఞ విస్తరణ జరిగినపుడు ఈ కార్యక్రమాలన్నీ

చాలా బాగున్నాయని ప్రజలు ప్రశంసించినపుడు వాటికి సహకరించి పనులు చేయాలి. అలా చేయనపుడు గౌరవమూ, విశ్వాసమూ నిలకడగా ఉండవు. అన్నీ గాలికి ఎగిరిపోతాయి. **మంచి మాటలు చెపుతున్నపుడు ఆవేశం కలుగుతుంది. కానీ అది నీటి బుడగలాగా ఒక్క క్షణం నిలిస్తే చాలదు. ఆవేశాన్నీ, విశ్వాసాన్నీ కార్యరూపంలోనికి తెచ్చుటకై సేవా కార్యక్రమాలు చేపట్టాలి.** అందుచేతనే మన కార్యక్రమాలన్నిటితో ఈ విషయాన్ని కూడా జోడించాము. మన కార్యక్రమాలతో ప్రభావితులైనవారు శ్రమించి సమాజానికి ఏదో ఒక విధంగా సేవలనందిస్తూ వీనిని విశ్వవ్యాప్తంగావిస్తూ మానవీయతను పెంపొందించి సుశిక్షిత పరివారంగా తయారగుటకు ఏదో ఒక విధమైనా రచనాత్మక కార్యాలు చేయాలి. ఈ విషయం శత సూత్రీయ యోజనలో విస్తారంగా తెలుపబడింది.

ఇక మూడవ చరణం సంఘర్షణ లేదా పోరాటం. సంఘర్షణ లేకపోతే అవాంఛనీయ తత్వాలను రూపుమాపలేము. కొంతమంది స్వార్థపరులూ లేదా

అవివేకులూ, తమ తమ తెలివితేటల్నీ ఉన్నతంగా ఊహించుకొని తమ బుద్ధినీ గురించి గర్వాన్ని పెంచుకొని తమ ఆలోచనలే సరైనవని వాదిస్తారు. తప్పు చేసిన ముదుసలి శ్రమకోర్చి, ఖర్చు చేసి హిమాలయం నాలుగు ధామముల యాత్ర ముగించుకొని పవిత్రుడనై పోయానని భావిస్తూ తోటివారిని కూడా తన మార్గములో నడవమని ప్రోత్సహిస్తాడు. ఈ రీతిలో తన తప్పు, ఒప్పు కాదని చెప్పినా వినడు మొండిగా వాదిస్తాడు. తన తప్పు ఒప్పుకోక పోవడం తన గొప్ప అనుకుంటాడు. పెళ్ళిళ్ళ విషయంలో కూడా ఇదే రీతిలో మా తాత ముత్తాతల కాలంలో చేసే వారు, ఆ పద్ధతిని మార్చలేము అంటారు.

ఈవిధమైన మూఢాచారాలతో స్వార్థపరులైన జాగీర్దారులు మొదలుకొని తాలుకాధికారుల వరకు, పూజారులూ, పండాలూ మొదలైనవారంతా అవాంఛ నీయమైన తత్వాలతో అవినీతి సంపాదన మరిగి వ్యర్థపు మాటలతో మోసం చేస్తున్నారు. ఏదైనా అవినీతిని గురించి చెప్పితే నిజమే, అలాగే అంటూ, వారే భ్రష్టాచార నిరోధ

సమితికి ప్రెసిడెంట్‌గా కూడా చెలామణి అగుచున్నారు. చేసేదంతా అక్రమ సంపాదనే. ఇటువంటి వారు సమాజంలో చాలా మంది ఉన్నారు. ఇటువంటి వారిని మార్చేదెలా? ఏదైనా నచ్చ చెప్పాలని ప్రయత్నిస్తే వారే పదిమందికి ధర్మబోధచేస్తారు. ఇటువంటి వారిని మాటలతో బాగు చేయలేము.

అవినీతిని ఎదుర్కోవడం అత్యవసరము

దీనికి ఏమి చేయాలి? సేవా కార్యక్రమాల అమలు ద్వారా శ్రమించడం, సేవాభావాన్ని వికసింపచేయడం జరగాలి. ఇందువలన అసంభవాలు- సంభవాలుగా మారుతాయి. కాని కొన్ని వేళల అంత రంగంలో ఉన్న కరడుగట్టిన స్వార్థము పెద్ద బండరాయిలాగా అడ్డు నిలుస్తుంది. దీన్ని తొలగించదానికి ఒకటే మార్గం అదే నయానా, భయానా చివరకు సంఘర్షణా పథాన్ని చేపట్టి వారిని ఎదిరించాలి. తప్పనిసరివేళ ధైర్యాన్ని, వివేకాన్ని

కూడగట్టుకొని పోరాటం సల్పాలి. మన ఋషులు, అవతారపురుషులైన రాముడు, కృష్ణుడు మున్నగువారు మనకందించిన మార్గ నిర్దేశనం ఇదే. దుష్టులను తొలగించాలి, ఎదిరించాలి, పోరాడాలి. ఋషుల నైతిక శిక్షణా, భాగవత రామాయణ కథలూ ప్రజలలో ప్రభావం చూపనపుడూ, భగవంతుడే స్వయంగా అవతరించాల్సి వచ్చింది. బాణాలు ఎక్కుపెట్టాల్సి వచ్చింది. పది అవతారాల్లో కూడా దండన అనివార్యమైంది. చిట్ట చివరి అవతారాలైన బుద్ధుడూ, వామన అవతారాల్లో మాత్రం జ్ఞానం ద్వారా పని జరిగింది. మిగిలిన అవతారాల్లో యుద్ధం చేయాల్సి వచ్చింది. అందుకు ప్రజలను కూడా సన్నద్ధం చేయాల్సి వచ్చింది.

అవాంఛనీయమైన పరిస్థితులను ఎదుర్కొని వానిని చక్కదిద్దుటకు సంఘర్షణ తప్పదు. అవాంఛనీయ పరిస్థితులను తొలగించుటకు ఎంత బోధించినా ప్రయోజనం ఉండదు. అందర్నీ సంస్కరించగల సమర్థులైన సాధువులెందరున్నారు? నారదుడు ఒక

గజదొంగ వాల్మీకిని మాత్రమే సంస్కరింపగల్గాడు. కావున సంఘర్షణ తప్పనిసరి. దీనికై ఒకరితోనొకరు ఎదురు నిలిచి పోరాడాల్సిన పని లేదు. యుగ పరివర్తన సమయంలో గొప్ప మహాభారతం ముడిపడి ఉంది. ఈ మహాభారతంలో ఖడ్గాలూ, తుపాకుల అవసరం లేదు. ఖడ్గాలూ, తుపాకులతో చేస్తే యుద్ధం సమిసిపోదు. పైగా క్రొత్త క్రొత్త సమస్యలు తలెత్తుతాయి.

హిందూ దేశంలో మహాభారత యుద్ధం జరిగింది. మహా భారత యుద్ధం తర్వాత వచ్చిన పరిస్థితులు ఇప్పటివరకూ సర్దుకోలేదు. రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. లక్షలాది ప్రజలు చనిపోయారు. ప్రపంచంలో స్వేచ్ఛ పెరిగిపోయింది కాని లాభం కన్పించలేదు. భవిష్యత్తులో మనం చేసే యుద్ధం విచిత్రమైన పద్ధతిలో ఉంటుంది. ఇచ్చట వివేకులు, అవివేకులతో పోరాడాలి. నచ్చచెప్పడంతోపాటు మనం చేయాల్సిన పని విభేద రూపంలో కూడా ఉండాలి. తప్పుడు పనులు చేసేవారితో ఏవిధంగానూ సహకరించక వారిని నిరోధించాలి.

సహాయ నిరాకరణ మొదటి మెట్టు

ఏ వ్యక్తి అయినా దురాచారుడూ, ధూర్తుడై ఇతరులకు నష్టం కలిగించుచున్నప్పుడు అతనిని నిరోధించక, పైగా అతను చెప్పిన దానికి ఊకొట్టడమూ మనము చేసే పెద్ద తప్పు. రెండవది అతనికి సహాయం చేస్తాము. మానవునిలోని ఈ పిరికితనం వలననే దుర్మార్గులు, పాపులు, గూండాలు మన సమాజంలో తయారవడానికి కారణమగుచున్నది. మనం ధైర్యంగా ఎదురు నిలచి దుర్మార్గునితో ఈ విధంగా చెప్పాలి. "మేము నీ తప్పుడు పనులకు సహకరించము. నీతో కలసి ఉండము, నిన్ను సమర్థించము". ఈ విధంగా చెప్పినపుడు దుష్టులలో ధైర్యం సగానికి సగము సన్నగిల్లుతుంది. పోట్లాడకపోయినా కనీసం అతనితో ధైర్యంగా మాట్లాడాలి. అదే నిజమైన పరాక్రమము. ఓట్లు అడగడానికి వచ్చిన వ్యక్తితో మీ ప్రవర్తన మాకు నచ్చలేదు. మీకు అసెంబ్లీలో ప్రజల తరపున కూర్చునే హక్కు లేదు. మీకు మేము ఓటు వెయ్యం అని నిష్కర్షగా చెప్పాలి. మనలో చాలా

మంది గ్రహించాల్సిన ప్రధాన విషయం ఏమనగా ఎవరైతే **మంచి పనులు చేయక తప్పుడు దారిలో నడుస్తుంటారో అతనితో రాజీపడరాదు.** అతనిని సమర్థించవద్దు. మీలో అతనితో పోట్లాడే ధైర్యం లేకపోతే మాట్లాడకుండా ఉండి, సరైన సమయం కోసం నిరీక్షించండి. **ఎటువంటి పరిస్థితి లోనూ అతనికి సహాయ పడడం కానీ, సమర్థించడం కానీ, అతనితో స్నేహం చేయడం కానీ చేయవద్దు.** అలా చేయకపోతే మనం అవినీతిని సమర్థించిన వారమవుతాం.

పోరాటం ఇచ్చట నుండే ప్రారంభమవుతుంది. **దుర్మార్గులకు సహాయ పడకూడదు.** ఒక జూదగాడు వచ్చి మిమ్మల్ని వడ్డీకి డబ్బు అడిగితే అప్పుడు నీవు జూదగాడివి డబ్బు ఇవ్వము అని ఖండితంగా చెప్పండి. ఇదే సహాయ నిరాకరణ. మంచిగానే మాట్లాడండి. మీ గౌరవం తగ్గకుండా మాట్లాడండి. ఉన్నది ఉన్నట్లుగా ధైర్యంగా చెప్పండి. అప్పుడు మేలే జరుగుతుంది. **దుర్మార్గుడు సింహం తోలు కప్పుకున్నంత మాత్రాన సింహం కాదు.**

మంచిని మంచిగా, చెడును చెడుగా తెలుసుకుని ప్రవర్తించాలి. దుర్మార్గులకు సహకరించకుండా ఉండడం నేర్చుకోవాలి.

చెడుకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. పోట్లాడుతున్నపుడు ఇరు వర్గాల వారికి దెబ్బలు తగులుతాయి. మనకు దెబ్బలు తగలకూడదంటే ఎలా? **ఒక మంచి గురించి మనం పోరాడేవేళ మనకు దెబ్బలు తగలవచ్చు. మరియు నష్టం కూడా కలుగవచ్చు. అన్నిటికీ సిద్ధపడాలి.** ఈ విధమైన ధైర్యం మనలో కలిగినపుడు చెడుకు సహకరించకూడదన్న భావం వికసించి బలీయమౌతుంది. పాపము, అవినీతి, అనాచారాలకు విరుద్ధంగా సంఘర్షణ చేయగలిగినపుడు నూటికి 50 శాతం విజయం ప్రాప్తిస్తుంది.

తర్వాత చరణం విరోధం

చెడుకు సహకరించకపోవడమే కాదు, **వ్యతిరేకించాలి కూడా.** ఒక తండ్రి కుమారునితో "20వేలు

వరకట్నం తీసుకోవాలి, నీవు నా కుమారుడివి, శ్రవణ కుమారుడూ, శ్రీరామచంద్రుడూ కూడా తండ్రి మాట విన్నారు. అట్లే నీవు కూడా నా మాట విను. మేము నీకు వివాహము చేస్తాము. తండ్రి ఆదేశాన్ని విను అంటాడు." సంస్కార విహీనుడైన తండ్రి మాటను వ్యతిరేకించే ధైర్యం కుమారునిలో రావాలి, తండ్రితో ఇలా చెప్పాలి, "మీరు నాకు తండ్రి, మిమ్మల్ని గౌరవించడం నా కర్తవ్యం. నేను మిమ్మల్ని ప్రేమిస్తాను, సేవ చేస్తాను, కాని మీరు చెప్పిన ఈ తప్పు మాటను నేను వినను. ప్రస్తుత మీ ఆలోచన ధర్మ విరుద్ధం. చెడును అంగీకరించకపోవడం, చెడు ఆదేశాన్ని ఉల్లంఘించుట, ఏ విధంగానూ తప్పుకాదు. మీరు పెద్దలు. నాకు తండ్రి. తండ్రి కంటే కూడా ధర్మం న్యాయం, వివేకం గొప్పవి".

న్యాయబద్ధుల ఉదాహరణలు

న్యాయ నిష్ఠుల ఉదాహరణలు చాలా ఉన్నాయి. ప్రహ్లాదుడు, విభీషణుడు మొదలైన వారు ఈ

కోపలోనివారే. ఒక తండ్రి కుమారునితో ఇలా చెప్పాడు. "నీవు బంగారం సంపాదించాలి. నీతిగానైనా సరే లేక అవినీతి మార్గంలోనైనా సరే. సమాజాన్ని గురించి ఆలోచిస్తే ఏమి లాభం?". దీనికి జవాబుగా కుమారుడు "నాకు బంగారం అవసరం లేదు, మనదేశంలో దుః ఖితులు, దరిద్రులు ఎంతో మంది ఉన్నారు. వారికి సహాయపడాలి. మన దగ్గర ఉన్న డబ్బు మనకు సరిపోతుంది. జీవితమంతా డబ్బు సంపాదించడంలోనే గడిపేస్తే మన జీవితానికర్థం ఏమున్నది? మనము మంచి పనులను ఎందుకు చేయకూడదు? భగవంతుని ఆజ్ఞాను సారం ప్రపంచంలో శాంతి కొరకు మనం ఎందుకు ప్రయత్నించకూడదు" అన్నాడు. దీనితో తండ్రికి చాలా కోపమొచ్చింది. నా మాట విని తీరాలి అన్నాడు. "ప్రహ్లాదుడు తండ్రి మాట వినలేదు. నేను నీ మాట వినను" అన్నాడు కుమారుడు. తండ్రి కొడుకును పీడిస్తూనే ఉన్నాడు. తండ్రి కొట్టాడు, తిట్టాడు, నోటికొచ్చినట్లు మాట్లాడాడు. కొడుకు శాంతంగానే జవాబు చెప్పాడు.

"తండ్రిగా మిమ్మల్ని గౌరవిస్తాను కానీ మీ మాట మాత్రం ఎటువంటి పరిస్థితుల్లోనూ వినను" ప్రహ్లాదుని తండ్రి **బాధలు పెట్టినా ప్రహ్లాదుడు వినలేదు".** అన్నాడు కొడుకు.

తండ్రిగానీ, మన పెద్దలు గానీ, ఇంకెవరైనా గానీ తప్పుడు మాటలు చెప్పినప్పుడు వారితో సూటిగా, గట్టిగా చెప్పండి "మీ మాటలు మేము వినము అని" చాలా మంది ఏదో విధంగా ధనం సంపాదించమని ప్రోత్సహిస్తారు. వారి మాటలు లక్ష్యపెట్టవద్దు.

న్యాయానికి కట్టుబడ్డవారు ఎందరో ఉన్నారు. విభీషణుడు మనకు ఆదర్శం. రావణుడు అతనికి అన్న సాధారణంగా అన్న చెప్పినట్లుగా తమ్ముడు వినాలి. అన్న చెప్పిన మాటలు సరైనవైతే తమ్ముడు విని తీరాలి. అన్న చేసే పనులు అన్యాయమైనపుడు అతన్ని సమర్థించడం సరైనది కాదు. రావణుడు తప్పుడు పని చేశాడు. కుంభకర్ణుడు అన్నను సమర్థించాడు. వారు విభీషణునితో "నీవు మన కుటుంబంలోని వాడివి. మేము నడచిన

బాటలో నడువు" అన్నారు. విభీషణుడు మాత్రం "నేను మీ వంశంలోని వాడిని, మీ కుటుంబంలోని వాడిని, మంచి పనులకు మాత్రమే సహాయం చేస్తాను. మీరు చేసే పనులు న్యాయ సమ్మతం కానపుడు నేను మీకు సహకరించను" అని జవాబిచ్చి రాముని పక్షాన చేరిపోయాడు.

ఇటువంటి సంఘర్షణ మన కుటుంబంలోని వారితో కూడా చేయాలి. కైకేయీ, భరతుని విషయం తీసుకుంటే భరతుడు తల్లి మాటను తిరస్కరించాడు. కైకేయి, భరతునితో "నేను నీకు తల్లిని, తల్లి మాట కొడుకు వినాలి. నేను ఈ రాజసింహాసనాన్ని నీకోసం ఉంచాను. నీవు సింహాసనాన్ని అధిష్టించాలి. రామచంద్రుని వనవాసాలకు పంపించాను. నీవు సంతోషంగా రాజ్యపాలన చేయి" అన్నది. దానికి భరతుడిలా జవాబు చెప్పాడు. "నీవు నాకు తల్లివి. నీకు భోజనం పెడతాను. నమస్కరిస్తాను. నీ కాళ్ళు కడుగుతాను. కానీ నీవు

చెప్పుచున్న ఈ తప్పుడు మాటను నేను ససేమిరా వినను. నీ మాట విన్నచో ధర్మానికి హానీ జరుగుతుంది. భగవంతుని బాట విడచిపెట్టినట్లవుతుంది. ఆత్మ గొప్పది, న్యాయం గొప్పది".

సాంప్రదాయాల కంటే వివేకం గొప్పది

మన సమాజంలో అనేక విధములైన చెడు ఆచారములు సంప్రదాయముల పేరిట చెలామణియగుట చూచుచున్నాం. వీనిని అనేకులు విశ్వసించుచున్నారు, ఆచరించుచున్నారు. వీనిని ప్రధానంగా వయోవృద్ధులు ప్రోత్సహించుట జరుగుచున్నది. **గౌరై పోకడ సమాజములో కనపడుచున్నది.** ప్రధానంగా వివాహ వేడుకలలో ఇట్టి మూర్ఖపు ఆలోచనలు, ఆచారాలు, సంప్రదాయాల పేరిట చెల్లుబాటగుట చూచుచున్నాం. విలాసవంతమైన వివాహాలకు వ్యతిరేకంగా మేము జరుపుతున్న వాటితో సంఘర్షించాలి. స్వార్థపరులు తమ

కొడుకుని అమ్ముకొని (కట్నంతో) ఇంట్లో సంపద పెంచుకోవాలనుకుంటారు. ఇంట్లో ఇష్టమొచ్చిన రీతిలో ఉండాలనుకుంటారు. వాటిని ఎటువంటి పరిస్థితుల లోనూ ప్రోత్సహించరాదు. ప్రతి యువకుడూ ఒక ప్రహ్లాదుడు కావాలి. తండ్రి చేస్తున్న చెడును, అన్యాయాన్ని వ్యతిరేకించాలి.

పెద్దలు, కోడలు ఆ వస్తువులు తేలేదు, ఈ వస్తువులు తేలేదు అంటుంటారు. అటువంటివారితో ఇలా చెప్పాలి. "అమ్మా! మేము పెద్దలకు సేవ చేస్తాము, కాని అనవసరంగా మీరు నియంతల్లాగా ప్రవర్తించాలని చూస్తే మేము ఆమోదించం. మీకు కోపం వచ్చినా పరవాలేదు. **న్యాయం, ధర్మం గొప్పవి.** మీరు నా భార్యపై నిందారోపణ చేయుట నాకు బాధను కలిగిస్తుంది. ఇటువంటి సంఘర్షణ తల్లిదండ్రులతోనూ, అన్నదమ్ములకు విరుద్ధంగా భార్యకు కూడా విరుద్ధంగా చేయవచ్చు. శంకరాచార్యుల తల్లి, కొడుకుతో వివాహం చేసుకొని స్థిరపడమని చెప్తుంది. కాని వారు తల్లితో నేను గృహస్థ

జీవితం గడుపుతూ ఉండాలా? సమాజ సేవ చేయనక్కర లేదా? మీరు నా కన్న తల్లే కావచ్చు. కానీ మీ మాట నేను వినను అని చెప్పారు. మన కుటుంబంలో భార్యా పిల్లలతో కూడా ఇటువంటి సంఘర్షణా అవసర మౌతుంది. మన దేశచరిత్రలో ఇటువంటి విషయాలు చాలా జరిగాయి. ఇటువంటి సంఘర్షణ ప్రవృత్తి ఆధారంగా చెడు ఆచారాలను మొదలంటూ తీసివేసి, ఈ ప్రవృత్తిని వికసింప చేయాలి.

మన పరివారంలో చాలా మంది అర్థం లేని పాత ఆచారాలలో చిక్కుకొని ఉన్నారు. మేము ఫలానా శాఖ వాళ్ళం, మేము కాన్య కుబ్జులం, మేము బాజపేయీలము, మేము మా శాఖలోని వారితోనే వివాహాలు చేసుకుంటాము. వేరే వాళ్ళు ముట్టింది మేము తినము. ఈ విధమైన అవివేకమైన ఆచారాలను పట్టుకొని వ్రేలాడుతుంటారు. ఇటువంటి వాళ్ళ మాటలను సమర్థిస్తూ న్యాయాన్ని హత్య చేయరాదు. ఇటువంటి అవాంఛనీయ తత్వాలకు విరుద్ధంగా పోరాడాలి.

గాంధీగారి ఆయుధాలైన సత్యాగ్రహము, సహాయ నిరాకరణలను ఉపయోగించాలి.

మనం చేయాల్సిన సత్యాగ్రహం ఇదివరకటిలాగా అహింసాత్మక మైనది కాదు. మేము నీ వాకిలి ముందు పడుకుంటాము. నా గుండెల మీద కాలుపెట్టి నీవు దాటిపో అంటారు. చాలా మంది సిగ్గులేని వారుంటారు. వారు నిజంగానే గుండెల మీద కాలుపెట్టి నడచివెళ్తారు. ఇప్పటి సత్యాగ్రహ పద్ధతి వేరైనది. నలువైపులా ముట్టడి, రెండు మూడువేల మంది కలసి ఒక దుర్మార్గుని చుట్టు ముట్టి అతన్ని ఇంట్లో నుండి బయటకి వెళ్ళనీయక పోవడం, అవాంఛనీయ సంఘటనలు జరిగేచోట, లంచ గొండితనము, కల్తీ వస్తువుల అమ్మకం ఇంకా ఎచ్చట అన్యాయం జరుగుతుందో, ఎచ్చట విశ్వాసఘాతం జరుగుతుందో అలాంటి చోట ఇలా అందరూ కలసి అడ్డగించాలి. ఈవిధంగా అడ్డగించడానికి ఒక సంఘర్షణా యుగనిర్మాణ సేనను తయారు చేయాలి. సమర్థవంతమైన ఈ సేన అవాంఛనీయమైన శక్తులను ఎదిరిస్తుంది. ఒక

చిన్న పిల్లను ఒక ముసలివాడికిచ్చి పెళ్ళి చేస్తున్నారు. అక్కడ సత్యాగ్రహాలు, పికెటింగ్‌లు పనికిరావు. అక్కడ అందరూ కలసి, వరుని గుఱ్ఱం, ముందుకు వెళ్ళకుండా అడ్డుకోవాలి. రెండు వేల మంది దారినడ్డగించి నిలబడిపోవాలి. పిల్ల తండ్రిని గదిలో బంధించాలి. దీని పరిణామమేమైనప్పటికీ ధైర్యంగా నిలవాలి. జైలుకు వెళ్ళాల్సి వస్తే వెళ్ళాలి. గాంధీజీ సమయంలో ఎందరో జైలుకు వెళ్ళారు. మీరు కూడా వెళ్తారు.

పశుబలిలాంటి అసహ్యకరమైన పనులను అడ్డగించాలి. మాంసం తినడము, తినకపోవడం వేరే సంగతి, దేవత ఒక మనిషి కాదు. ఒక మానవుడు ఆమెకు యజమాని కాదు. దేవతను అపకీర్తి పాలు చేయవద్దు. దేవత నీది, నాది కాదు. సమస్త హిందు సమాజానికి సంబంధించిన ఆ దేవిని కళంకితం చేయరాదు. దేవతకు పూజ చేయండి. పూలు, చందనం సమర్పించండి. కాని ఆమెను ఒక హత్యాకారిగా, ఒక పిశాచిగా, ఒక క్రూరురాలిగా చూపి తల్లిని అవమానించకండి, దేవత

కొరకు ఒక జంతువును చంపుతారు. ఆ తల్లి ఎప్పుడూ రక్తం త్రాగదు. రక్తం తాగేదయితే ఆమెను దేవతగా, తల్లిగా ఎలా ఆరాధిస్తాము? ధర్మంలో అటువంటి దేవతకు స్థానం లేదు. హత్య చేయడం, రక్తం త్రాగడం, బలి ఇవ్వడం వీనికన్నింటికీ ధర్మంలో స్థానం లేదు. అది ఒక సహించరాని పాపం, పైశాచికత్వము.

ఈ పైశాచిక ప్రవృత్తి మన హిందూ సమాజంలో అక్కడక్కడా వ్యాపించి ఉంది. ప్రజల్లో వివేకాన్ని ఉత్పన్నం చేయడం మన కర్తవ్యం. ప్రపంచంలో ఎచ్చటగానీ జంతువుల యొక్క గానీ, మనుష్యుల యొక్క గానీ మేకలూ కోళ్ళ యొక్క గానీ, రక్తం తాగి మాంసం తినే దేవి ఎచ్చట లేదు. అది దేవతల పని కాదు.

తీవ్రమైన ఆందోళన చేయాలి

చెడు పద్ధతులకు విరుద్ధంగా సాధ్యమైనంత వరకూ సత్యాగ్రహం చేసి అవసరమైతే జైళ్ళకు వెళ్ళాల్సి వచ్చినా వెళ్ళాలి. నష్టం కలుగుతుందన్నపుడు చట్టాన్ని కూడా

ఉల్లంఘించవచ్చు. చట్టం న్యాయానికి విరుద్ధమై బాధా కరమైనపుడు ఆ చట్టాన్ని కూడా ఉల్లంఘించాలి. ఆ సమయంలో ఏదైనా నష్టం వాటిల్లినా దాన్ని సహించ గలగాలి. **చట్టానికంటే న్యాయం గొప్పది.** ఒక చిన్న పిల్లను ఒక ముసలవాడికిచ్చి పెళ్ళి చేస్తున్నారు. అప్పుట చట్ట ప్రకారం ఏ అవరోధం లేకుండా ఉండవచ్చు. కానీ అప్పుడు చట్టాన్ని లెక్క చేయవద్దు. చట్టాన్ని అతిక్రమిస్తాం.

ఈ విధంగా ప్రజల్లో తిరుగుబాటు ధోరణి పెంపొందించాలి. సమాజానికి అత్యంత ఆవశ్యకమైన మార్గాన్ని తెలియచెప్పాలి. **ధర్మం పేరిట ధనం దుర్వినియోగమై పోతున్నపుడు తప్పనిసరిగా అడ్డుకోవాలి.** స్వార్థపరులైన మహంతులు తమ పీఠం కొరకూ లేదా వ్యక్తుల కొరకు అక్రమంగా ధనాన్ని జమచేస్తారో, వాటిని నిరోధించి సమాజం కోసం ఖర్చు చేయాలి. ఏ దేవాలయంలో పూజారులు, మహంతులు, కోట్లు సంపాదిస్తూ మహారాజుల్లాగా విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారో ఆ దేవాలయాలకు డబ్బులివ్వ కూడదు.

ఇటువంటి పూజారులు లేదా మహంతులతో "మిమ్మల్ని ఇక ధర్మాచార్యులుగా కొనసాగనీయము, మీరు ధర్మాచార్యులయితే సాధువుల లాగా జీవించండి. మీ వద్దనున్న ధనాన్ని లోక కల్యాణ కార్యక్రమాలకు, వెనుకబడ్డ సమాజ ప్రజలకూ వినియోగించండి," అని చెప్పాలి. స్వార్థపరులైన వారు మీ మాటలు వినకపోతే వారితో సంఘర్షణ చేయాలి. సంఘర్షణ ఎలా ఉండాలనేది తర్వాత నిర్ణయిస్తాము. మనం ఒక లోకవాహినీ సేనను తయారు చేయాలి. వారు స్వయం సేవకులుగా ఉండి అవసరమైతే చావడానికి కూడా తయారుగా ఉంటామని చెప్పాలి. లోకవాహినీ సేన సంరక్షణకు శిబిరాలు తయారు చేయాలి. ఆ సేన ప్రదర్శనలు ముట్టడి, సత్యాగ్రహము మొదలైన కార్యాలు చేయాలి. అన్యాయానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ధోరణి ప్రజల్లో కలిగించాలి. తిరుగుబాటు ధోరణి ఉన్నవారి సంఖ్య తక్కువగా ఉన్నపుడు వారి సహాయార్థము ఒక పెద్దలోకవాహినీ సేన తయారవ్వాలి. ఈ సేన ప్రభుత్వ సేనలాగ కాక, క్రాంతికారీ సేన లాగా,

లోక నిర్మాణ సేనలాగా భావి మహాభారత స్వరూపాన్ని **తెలిపే, ఒక సేన కావాలి.** ఈ సేన భ్రష్టాచారులు, విశ్వాస ఘాతకులు, పాలల్లో నీరు కలిపేవారు, తూకంలో మోసం చేసేవారు, కొలతల్లో మోసం చేసేవారు ఇలా అవాంఛనీయ ప్రక్రియలను సమాజంలో ఉత్పన్నం చేసి వ్యాపింపచేసే వారిపైన దండెత్తాలి, ఎదిరించాలి. వారిపైన ఇటువంటి పనులు చేయకుండే విధంగా ఒత్తిడి చేయాలి.

అనేక పద్ధతుల్లో సంఘర్షణ

మనవద్దనున్న డబ్బుతో మనం ఏ పనినైనా చేయవచ్చునన్న మినహాయింపులేదు. సినిమా వారికి విరుద్ధంగా పికెటింగ్ చేయవచ్చు. ధర్నా చేయవచ్చు. కెమెరాలకు అడ్డు తగులవచ్చు. వారి పనులు విఫలమయ్యే విధంగా ఏమైనా చేయవచ్చు. ప్రజల్లో చెడును వ్యాపింపచేసే గాయకులు, సంగీతము ఇటువంటి వాటికి విరుద్ధంగా సత్యాగ్రహము చేయవచ్చు. సమాజానికి అపకీర్తి తెచ్చే విధంగా ఉన్న సాహిత్యాన్ని వ్రాసే వారి

ఇంటివద్ద నిరాహారదీక్ష ప్రాణం పోయినా పరవాలేదని చేయాలి. సమాజాన్ని పాడు చేసే విధంగా చేసే ప్రసంగాన్ని ఉటంకిస్తూ వ్రాసి అందరికీ పంచాలి. డబ్బుల కొరకు సమాజానికి కీడు చేస్తూ ఎంతమందిని పాడు చేశారనేది ప్రజలందరికీ తెలియచేయాలి. ఇటువంటి వారి బండారం బయటపడేలా మనం ధైర్యంగా నిలవాలి.

తమను ఎదిరించేవాడు లేరనే ధైర్యం ఉన్నందువల్లే ఈ గూండాయిజం ప్రబలింది. మనం తలచుకుంటే ఏ పనినైనా చేయవచ్చు. ఎప్పుడైతే ఈ గూండాలకు తమను ఎదిరించే వాడు ఎదుట నిలబడ్డారనీ, మనం చేసే తప్పుడు పనులకు విరుద్ధంగా పోరాడుతారని తెలిస్తే వారిలో ధైర్యం సన్నగిల్లుతుంది. **ఒకరికి నష్టం కలిగినపుడు వేరొకరు మౌనంగా ఉంటున్నందువల్లే గూండాయిజం పెరిగి పోయింది.** ఒక మనిషికి నష్టం జరిగితే ఇంకొక మనిషి నాకెందుకులే అని మౌనంగా ఉంటున్నాడు. అతను ఒకరి కోసం నేనెందుకు కష్టాల్లో ఇరుక్కోవాలి అనుకుంటాడు. ప్రాణాన్ని సహితం లెక్కచేయక కష్ట సమయంలో ధైర్యంగా

నిలబడి తమ జీవితాన్ని, ప్రాణాన్నీ, సవాళ్ళను ఎదుర్కొనడానికి సమర్పించు కుంటారో అటువంటి లోకసేవకులు నిలబడితే అన్ని సమస్యలు తీరిపోతాయి. జీవితంలో అలసిపోయిన వారు మేము ఒంటరి వాళ్ళము మేము ఏమి చేయగలము, గూండాలు మమ్మల్ని బాధిస్తున్నారు అనుకునేవారికి అవినీతిని ఎదుర్కోవడానికి లోకవాహిని సైన్యంతోపాటు అసంఖ్యాకములైన ప్రజలు కూడా వారికి అండగా నిలవాలి. అప్పుడు ఒక విప్లవము ఉత్పన్నమౌతుంది. **వ్యక్తుల మధ్య, సమాజంలోనూ, మంచి చెడుల మధ్య ఉత్పన్నమయ్యే యుద్ధ జ్వాలను అట్టి విప్లవజ్వాలతో చెదరగొట్టవచ్చును.**

అసంతోషమనే అగ్నిని మనలోపలే మండేలా చేసుకోవద్దు. అసంతోష పరిస్థితులను దూరం చేయాలి. వాటితో పోట్లాడి వాటిని తొలగించాలను కుంటున్నాము. కనుక మన అంతిమ అడుగు, ప్రజలు, జ్ఞాన యజ్ఞంతో ప్రభావితులై సేవాకార్యాలతో వారి మనోభూమిని వికసింప

చేసికొని సమాజం ఎడల వారి కర్తవ్యాన్ని నిర్వహించాలి, త్యాగం చేయాలి. ఈ విధంగా మానవుడు తాను సమర్థుడనన్న అనుభవం కలిగించుకొన్నపుడు మనం మూడవ అడుగైన సంఘర్షణ అనేదానికి విశాలమైన ప్లాను వేసుకోవాలి.

ఆ ప్లాను వేసే సమయం ఇంకా రాలేదు. ప్రస్తుతం జ్ఞాన యజ్ఞ కార్యక్రమాలు, రచనాత్మక కార్యక్రమాల దిశను నిర్ధారిస్తున్నాము. **మనము ఒక లోక వాహిని సేనను తయారుచేసి అవినీతికి విరుద్ధంగా అవాంఛనీయ పరిస్థితులకు విరుద్ధంగా, అనావశ్యకమైన వాటికి విరుద్ధంగా, మూఢ నమ్మకాలకు విరుద్ధంగా యుద్ధం చేయాలి.**

ఉపయోగకరమైన రణనీతి కావాలి

ఈ విధమైన యుద్ధం ఎలా చేయాలన్నది పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఇందుకు ఒక రణనీతిని నిర్ధారించుకోవాలి. దాని స్వరూపాన్ని ఇప్పుడే

తయారు చేసుకోలేము. ఏ దిశలో ఎప్పుడు తుపాకి పేల్చాలి, మౌనంగా ఉండాలా, ముందుకు వెళ్ళాలా, వెనక్కి నడవాలా ఇవన్నీ అప్పటి సేనాపతి చేయవలసిన పని. జ్ఞాన యజ్ఞం, రచనాత్మక కార్యక్రమాల లాగా, సంఘర్షణ రూపురేఖను ఇప్పుడే తయారు చేయలేము. అది అప్పటి పరస్థితులను బట్టి ఉంటుంది. ఎక్కడ అవాంఛనీయ పరిస్థితులు ఎంత తక్కువగా ఉన్నాయి. ఎక్కడ క్రోధం ఎక్కువగా ఉందో ఎక్కడ జనులు సహకారము చేయడానికి తయారుగా ఉన్నారో అటువంటి స్థలాల్నీ ముందుగా ఎన్నుకొని నడవాలి. **సాఫల్యం జరుగుతుందని ఆశ ఉన్న పనులకు ప్రాముఖ్యమివ్వాలి.**

పనులు ఎక్కడ నుండి మొదలు పెట్టాలి, ఎక్కడ అంతం చేయాలి. అనేదాని కన్నా, నూతన యుగం ప్రారంభించడానికి వ్యక్తి నిర్మాణాన్ని ముందు చేపట్టాలి. **మనం చేయవలసిన పని అవాంఛనీయ తత్వాలను ఎదుర్కొనుట,** దీనికి ఒక లోకవాహినీ సంఘర్షణ సేన ఉండాలి. వాటికి శిబిరాలు తయారు చేసుకోవాలి,

ఉండడానికీ, భోజనానికీ ఏర్పాటు చేయాలి. దేశాన్ని సంరక్షించే సేవలు ఏ విధంగా ప్రాణాలకు తెగించి పనిచేస్తారో అదే విధంగా మనలోక వాహిని సేన కూడా పాప కార్యాలూ, అనాచారాలకు విరుద్ధంగా పోరాడాలి. ప్రాచీన కాలంలో క్షత్రియులు కూడా దేశ రక్షణకు ఇలాగే పోరాడేవారు.

బ్రాహ్మణులు జ్ఞాన యజ్ఞం ద్వారా, క్షత్రియులు పోరాటాల ద్వారా వైశ్యులు తదితరులు ఎవరైతే సేవా తత్పరులో వారు సేవాకార్యక్రమాల ద్వారా పోరాటం సల్పాలి. రచనాత్మక కార్యక్రమాలు మూడు భాగాలుగా ఉన్నాయి. గాయత్రీ మంత్రం మూడు చరణాల స్వరూపంగా యుగ నిర్మాణ యోజనను మూడు భాగాలుగా విభజించారు. ఇప్పుడు జ్ఞాన యజ్ఞము, తర్వాతి రోజుల్లో రచనాత్మక కార్యక్రమాల ద్వారా పాప ప్రక్షాళన చేస్తాము. అనాచారమూ, అవివేకమూ, అజ్ఞానము, అన్యాయాలూ ఏవైతే సమాజమంతా

ఆవరించి ఉన్నాయో, వాటి మూలాల్నే నాశనం చేస్తాము. అటువంటి అంతిమ యుద్ధం మన లక్ష్యం. అదే మన భావిభారత యుద్ధం అప్పుడు భారతదేశం చిన్నదిగా ఉండదు. అది విశ్వవ్యాప్తమైన భారతము. దాన్నే మనం మహాభారతమని చెప్పగలుగుతాము. మనం చేసే ఈ మహాభారత యుద్ధం వలన ఎక్కడా ఏ విధమైన చెడూ మిగలదు. ఈ పోరాటానికి ఒక స్వరూపాన్ని తయారు చేయాలి. ఆందోళన ద్వారా సంతకాల ద్వారా, అదే విధంగా చెడు పనులు చెయ్యము అని ప్రతిజ్ఞల ద్వారా ప్రారంభిస్తాము. తర్వాత కార్యక్రమాలను వికసింప చేస్తాము, విస్తరింపచేస్తాము.